# భ్రాంతి

పాలంకి సత్య



అందమైన, అధునాతనమైన బంగళాలోకి అన్నపూర్ణ భయపడుతూ అడుగు పెట్టింది. ఏడాదికో, ఏణ్ణర్థానికో అపురూపంగా చూసే సినిమాలలో తప్ప ఆమె ఎన్నడూ బంగళాలను ప్రత్యక్షంగా చూడలేదు. ఆమెకు పల్లెలో తానుండే రెండు గదుల తాటాకుల ఇల్లు జ్ఞాపకం వచ్చింది. తను ఇంత మంచిచోట పని చేస్తున్నానని తెలిస్తే తల్లిదండ్రులూ, చెల్లెళ్ళూ, తమ్ముడూ ఎంత సంతోషిస్తారో!

అన్నపూర్ణకు ఆనంద తరంగాలపై తేలిపోతున్నట్టనిపించింది. ఇక్కడ తను హాయిగా పని చేసుకుంటుంది. తన పనికి బంగళాలో మేడమ్ పంపించే డబ్బుతో తన కుటుంబ సభ్యులు హాయిగా ఉంటారు. తనకు మంచి పని చూపించిన పాపారావు మామయ్యకు తన చర్మంతో చెప్పులు కుట్టించినా ఋణం తీరదు.

అన్నపూర్ణ ఒకసారి చుట్టూ చూసింది. పెద్ద హాల్లో తివాచీలు, రకరకాల కుర్చీలు... అసలిలాంటి చోట చేద్దామన్నా పనేముంటుంది? నూతిలో నీళ్ళు తోడాలా? పేడ కళ్ళాపీ చల్లాలా? పొయ్యి అలకాలా? అందుకే కాబోలు పాపారావు మామయ్య రోజుకి రెండు, మూడు గంటల కన్నా పని ఉండదన్నాడు.

''నీ పేరేమిటి?'' మేడమ్ పిలుపుతో ఇహలోకం

లోకి వచ్చిన అన్నపూర్ణ తన పేరు చెప్పింది.

''అన్నపూర్ణా!

మరీ పాతకాలందిలాగా ఉంది నీ పేరు. ఈ రోజు నుంచీ నీ పేరు 'అనూష'. ఎవరడిగినా ఆ పేరే చెప్పాలి! ఓకే!'' అంది.

తన పేరు మార్పు అన్నపూర్ణకు నచ్చకపోయినా తల ఊపింది. పట్నాలలో అంతా ఇలాంటి పేర్లే పెట్టుకుంటారేమో! మేడమ్‌లాగే వేషమేసుకుంటారా? బాబ్డ్ హెయిర్, ఒళ్ళు కన్పించే శారీ, స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో ఉన్న మేడమ్ వస్త్రధారణ అన్నపూర్ణకు నచ్చలేదు. 'పోనీలే మనిషి మంచిదయితే చాలు!' అనుకుంది.

''అనూష ప్రయాణంలో అలసిపోయినట్టుంది. లోపలకు తీసికెళ్ళి స్నానానికీ, భోజనానికీ ఏర్పాటు చెయ్యి. నాలుగైదు రోజులు విశ్రాంతిగా వుండి, కొత్త చోటుకి అలవాటుపడనీ. ఆ తర్వాత పని చేయించవచ్చు'' అని మేడమ్ అక్కడే ఉన్న ఒక అమ్మాయితో చెప్పింది.

ఆ అమ్మాయి అన్నపూర్ణను లోపలికి తీసికెళ్ళింది.

''మేడమ్, నా కమిషన్ నాకిచ్చేస్తే నేను మళ్ళీ పని మీద బయల్దేరతాను'' అన్నాడు పాపారావు.

ఆవిడ డబ్బు తీసిచ్చి ''ఈ అమ్మాయి వివరాలు చెప్పు'' అంది.

''కృష్ణమూర్తి అని మాకు దూరపు బంధువు లెండి. పల్లెలో చిన్న తాటాకుల ఇల్లూ, అరెకరం భూమీ మాత్రమే ఆస్తి. పౌరోహిత్యం మీద డబ్బు వచ్చినప్పుడు వస్తుంది, లేనప్పుడు లేదు. అయిదుగురు అమ్మాయిలూ, ఒక అబ్బాయి మేడమ్.''


''ఫ్యామిలీ ప్లానింగ్ మాట వినలేదా?'' అంది మేడమ్.

''వంశోద్ధారకుడు కావాలన్న తపన. అసలే పేదరికం, ఆపైన ఆరుగురు సంతానం. ఇల్లు గడవడం దుర్లభమైపోయింది. అన్నపూర్ణ తెలివైన పిల్ల. కానీ టెన్త్‌తోటే చదువు ఆపేయాల్సి వచ్చింది. మిగతా అమ్మాయిలకి ఆమాత్రమూ లేదు. ఏరోజు ఇంట్లో భోజనముంటుందో, ఏరోజు వుండదో కూడా తెలియదు. అందుకే నేను అడిగిన వెంటనే కృష్ణమూర్తి ఎగిరి గంతేసి ఒప్పుకున్నాడు.''

''ఫ్యామిలీ ప్లానింగ్ పాటించకపోవడం మనకి లాభించిందిలే!''

''మేడమ్! నాకో చిన్న సందేహం. బాగా చదువుకుని, చలాకీగా ఉండే పాతిక, ముప్పై ఏళ్ళ వాళ్ళు మీ దగ్గర చాలా మందే ఉన్నారు కదా! ఈ పల్లెటూరి పిల్లలకోసం ఎందుకింతగా ప్రయత్నిస్తున్నారు?''

మేడమ్ అసహనంగా జుత్తు వెనక్కి తోసుకుంది. ''ఈ ఎయిడ్స్ భూతం వచ్చి నా ప్రాణాలు తీసేస్తోంది. అనుభవమున్న ఆడదానికి ఎయిడ్స్ తప్ప




కుండా ఉంటుందని అందరూ నమ్ముతున్నారు. చిన్న పిల్లలయితే ఈ రోగం రాదని మగవాళ్ళ ఆశ. అందుకే పదహారేళ్ళ పాపలకే డిమాండు.''

పాపారావు అర్థమైనట్టు తలవూపి వెళ్ళిపోయాడు.

OOO

నాలుగు రోజులు అన్నపూర్ణకు హాయిగా గడిచాయి. అయిదో రోజు భోజనాల దగ్గర మేడమ్ ''జాబిల్లీ! ఇక్కడ ఏం పని చెయ్యాలో అనూషకు చెప్పు'' అంది.

''అలాగే మేడమ్'' అంది జాబిల్లి.

మేడమ్ అనడమే కాని ఈవిడ పేరు ఎవరికీ తెలియదు అనుకుంది అన్నపూర్ణ ఉరఫ్ అనూష. భోజనాలయ్యాక జాబిల్లి అనూషను తన గదిలోకి తీసుకెళ్ళింది.

''అనూషా! పెళ్ళి ఎందుకు చేసుకుంటారు?'' అడిగింది.

అనూషకు ఈ ప్రశ్న అర్థం కాలేదు.

''ఎందుకేమిటి? అందరూ ఎందుకు చేసుకుంటున్నారో అందుకే!''

''అందరూ ఎందుకు చేసుకుంటారు? ప్రేమకోసం, పిల్లలకోసం! అవునా?''

అనూష తల ఊపింది.

''పిల్లలెలా పుడతారో తెలుసా?''

అనూష సిగ్గూ, కోపం మేళవించిన స్వరంతో ''ఛీ అక్కా! అదేం ప్రశ్న?'' అంది.

''నీకు తెలియదని అడగడం లేదులే. భార్యా, భర్తా కలిస్తే పిల్లలు పుడతారు. దాన్ని దాంపత్యం అంటారు.''

''అవును.''

''భార్యా, భర్తా కాని స్త్రీ పురుషులైతే...''

''వ్యభిచారం'' అనూష గొంతు అసహ్యంగా పలికింది.

''పురుషు[illegible] ్ఛిచ్చిన చోట...''

''అది వేశ్యలు చేసే పని'' అనూష కంఠం కోపంగా ధ్వనించింది.

''వేశ్యలు అన్నది పాతమాట. 'సెక్స్ వర్కర్లు' అన్నది ఇప్పటి మాట. మనమూ కార్మికులమే. సెక్స్ అనే పని చేస్తాం.''

''మనం చెయ్యడమేమిటి? నేను చెయ్యను.''

జాబిల్లి జాలిగా నవ్వింది. ''చెయ్యక ఏం చేస్తావు? ఇక్కడకు వచ్చిన వాళ్ళు బయటికి పోలేరు. మేడమ్‌కు మంత్రుల దాకా అంతా పరిచయమే. దెబ్బలు తినీ, వాతలు పెట్టించుకునీ లొంగిపోవడమెందుకు? ముందు నుంచీ మంచిగా మాట వింటే మంచిది.''

అనూష నిస్సహాయంగా చూసింది. ఎంత మోసం చేశాడు పాపారావు మామయ్య! ఛీ వాడు మామయ్యేమిటి? పాపాత్ముడు. తన తల్లిదండ్రుల్నీ, తననీ మోసంచేసి సానికొంపలో పడేశాడు. ఎలాగైనా నాన్నకు ఈ విషయం తెలియజెయ్యాలి. వెంటనే వచ్చి అంతవరకూ మేడమ్ ఇచ్చిన డబ్బు ఆవిడ ముఖాన కొట్టి నాన్న తనను తీసుకెళ్ళిపోతాడు. ..

నాన్నకు ఉత్తరం ఎలా పంపించాలో అనూషకు తెలియలేదు.

OOO

అనూష పరిస్థితులకు రాజీపడిపోయింది. ప్రతి రాత్రీ అందంగా, ఆకర్షణీయంగా అలంకరించుకోవడం, తనను కావాలన్న వాడికి తన శరీరాన్ని అప్పజెప్పడం, తన శరీరాన్ని వాడుకున్న మగవాడు నిద్రపోయాక తనివితీరా ఏడవడం, మోసం చేసి తనను ఈ పాప పంకిలంలోకి దింపిన పాపారావుని తిట్టుకోవడం ఆమెకు అలవాటై పోయాయి. రెండు, మూడు గంటల పని అని చెప్పి పాపారావు ఎంత మోసం చేశాడు? ఇటువంటి పని అని తెలిస్తే తండ్రి తనని ఇక్కడికి పంపించేవాడా? ఇలాంటి ఆలోచనలతో ఏ వేకువనో నిద్రాదేవి ఒడిలోకి జారుకునేది అలసటగా, అవిశ్రాంతంగా అనూష. ★